## ఆర్ఆర్ఆర్ బాధితులకు అండగా ఉంటా : కొమటిరెడ్డి



**భువనగిరి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :** రీజనల్ రింగ్‌రోడ్డు రాయగిరి బాధితులకు అండగా ఉండి సమస్యల పరిష్కారం కోసం సానుకూల నిర్ణయం తీసుకునే విధంగా కృషి చేస్తానని భువనగిరి ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆర్ఆర్ ఆర్ బాధితులు ఎంపి కోమటిరెడ్డిని స్థానిక వివేరా హోటల్‌లో కలిసిన సందర్భంగా హామి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి నితిన్ గట్కారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, పంజాల రామాంజనేయులు గౌడ్, కౌన్సిలర్లు కైరంకొండ వెంకటేశ్, ఈరపాక నర్సింహ, పడిగెల ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**డిండి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** డిండి మండల పరిధిలోని శక్రు తండా గ్రామపంచాయతీ సపావట్ రాము తండ్రి పేరు హర్యా కడుపు నొప్పి తట్టుకోలేక శనివారం రోజున మృతి చెందడంతో కార్యకర్త మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అక్కడకి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సిరాజ్ఖాన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లవెల్లి రాజేశ్వెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దింతినేని వేంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జంగా గిరీష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగా లింగయ్య, బధ్య రమేష్, లక్పతి లక్ష్మణ్, సిద్ధూ ,శ్రీశైలం, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

**మునుగోడు రూరల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:** ఉప ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని ముదిరాజ్ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకనబోయిన రమణముదిరాజ్ అన్నారు. శనివారం మునుగోడు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 50లక్షల అత్యధిక జనాభా కలిగిన తెనుగుగౌడ్, బంటు, ముత్తరాసి, కోలి, ముదిరాజ్‌లు మునుగోడు నియోజకవర్గంలో అత్యధికంగా 40వేల ఓటు బ్యాంక్ కలిగిన బలమైన సామాజిక వర్గం ఎన్ని ఏండ్లయినా ముదిరాజ్‌ల చిరకాల కోరికయినటువంటి బీసీడి టూ ఏ లేదా ఎఫ్, ముదిరాజ్ కార్పోరేషన్ ఏర్పాటు చేయడం లేదని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ యువత చదువు, ఉద్యోగాల పరంగా వెనుకబడి ఆగమ్యగోచర స్థితిలో ఉన్నారని మునుగోడు నియోజకవర్గంలో ముదిరాజ్‌ల ఓటుబ్యాంకు ఎక్కువ ఉన్నందున ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని లేనిచో స్వతంత్ర అభ్యర్థిని బరిలో దింపుతామని అన్నారు. మండలాల వారీగా ముదిరాజ్‌లతో సమావేశాలు నిర్వహించిన అనంతరం చివరగా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఎమ్మెస్ రాష్ట్ర మహిళ ఉపాధ్యాక్షురాలు కోట్ల పుష్పలత, రాష్ట్ర కార్యదర్శి కోట్ల కృష్ణయ్య, ఎంపిటిసి యాదయ్య, శంకర్, యువత రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెబోయిన రాంకుమార్, యూత్ సెక్రటరీ దోటి సాయిరాం, మునుగోడు నియోజకవర్గ ఉపాధ్యాక్షుడు వీరమల్ల సైదులు, నర్సింహ, వెంకన్న, లింగయ్య, లింగస్వామి, శంకర్, నాగరాజు, ఆంజనేయులు, శ్రీను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నాం

**భువనగిరి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :**



భువనగిరి నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని బండసోమారం గ్రామంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన నిర్వహించారు. గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన 32 కుటుంబాలకు పైళ్ళ ఫౌండేషన్ తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.5000 చొప్పున మొత్తం లక్ష 60 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండసోమారం గ్రామంలో రాజకీయాలకు అతీతంగా అందరూ అభివృద్ధి కోసం పాటుపడతారని అన్నారు. గ్రామంలో వాటర్ ఫిల్టర్, రోడ్డు మరమత్తులకు నిధులు కేటాయించడానికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్, జెడ్పిటిసి సుబ్బూరు బీరు మల్లయ్య, ఏఎంసి చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ అమరేందర్, సింగిల్ విండో మాజి చైర్మన్ బల్గూరి మదుసూదన్‌రెడ్డి, సర్పంచ్ నాణెం పద్మ కృష్ణ గౌడ్, మాజి సర్పంచ్ కాటిక జంగయ్య, తెరాస నాయకులు నల్లమాస రాజుగౌడ్, ఎంపిటిసి బొక్క కొండల్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు జనగాం పాండు, ఓంప్రకాష్ గౌడ్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు సామల వెంకటేశం, నాయకులు కేశవపట్నం రమేష్, చిన్నం పాండు, అంకర్ల మురళి, గౌరారం నరేష్, రేగు వెంకటేష్, ఎంపిట అనురాధ దేవి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు – ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

**నేరేడుచర్లటౌన్ సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలే లక్ష్యంగా పని చేస్తుందని హుజూర్‌నగర్ శాసన సభ్యులు శానంపూడి సైదిరెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం సాయంత్రం నేరేడుచర్లలోని రాచకొండ సీతారామనర్సయ్య టౌన్‌హాల్‌లో ఆసరా పెన్షన్‌కార్డులు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆసరా కార్డు కాదని, పెన్షన్‌దారులకు ఆత్మగౌరవకార్డు అన్నారు. జీవితాంతం ఉద్యోగాన్ని కల్పించే గుర్తింపుకార్డు అని పేర్కొన్నారు. వృద్ధులకు చిన్న చిన్న కోరికలు తీర్చడానికి ఆసరా ఇస్తుందని అన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేని విధంగా 44 లక్షల మందికి నేరేడుచర్ల మునిసిపాల్టీలో 2,364 మందికి, నూతనంగా 415 మందికి పెన్షన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని గుర్తింపు తేవడానికే రాజకీయాలలోకి వచ్చినట్లు తెలిపారు. గతంలోని పాలకులు దోచుకొని దాచుకున్నారని, టిఆర్ఎస్ ప్రభుత్వం సంపాదిస్తుందని, ఖర్చు పెడుతుందని వివరించారు. దేశంలోని కమ్యూనిస్టు నాయకులు ముఖ్యమంత్రి కెసిఆర్ పనితీరును అభినందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, డిసిసిబి డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, కమీషనర్ నీలిగొండ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటి చైర్మన్ ఇంజమూరి యశోదరాములు, కౌన్సిలర్లు షేక్ బాషా, తాళ్లూరి సాయి, కొదమగుండ్ల సరిత, అలక సరిత, వేమూరి నాగవెల్లి నారాయణ, లలిత భరత్, షేక్ షహనాజ్, గ్రంధాలయ అభివృద్ధి కమిటి చైర్మన్ గుర్రం మార్కండేయ, మేనేజర్ అశోక్‌రెడ్డి, టిఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి పెద సైదులు, నాయకులు ఇంజమూరి మల్లయ్య, కొమరాజు వెంకట్, రూపాని ఉదయ్, బుడిగ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలిః మున్సిపాలిటీ చైర్‌పర్సన్



**హాలియా, ప్రభాతవార్త. సెప్టెంబర్ 10ః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హాలియా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య అన్నారు. శనివారం హాలియా మున్సిపాలిటీలోని 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి అధ్వర్యంలో అసరా పెన్షన్ నూతన లబ్దిదారులకు అసరా ఫించన్‌లను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కేసీఆర్ అధినాయకత్వంలో వృద్దులకు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు 2,016, వికలాంగులకు, వితంతవులుకు 3వేల రూపాయలను అందజేస్తున్న ఘనత మన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ కమీషనర్ కందిమళ్ల వీరారెడ్డి, సోమయ్య, సతీష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో అందరికీ నాణ్యమైన వైద్య సేవలు

### కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్

**బీబీనగర్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



దేశంలోని ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ పేర్కొన్నారు. యాదాద్రి బువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం రెయిన్ బోలో, డిజిటల్ రేడియోగ్రఫీ, అల్ట్రా సోనోగ్రఫీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన సేవలు అందించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలోచన ఆరాటమని తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ దేశంలోనే ప్రతిష్టాత్మక ఎయిమ్స్ గా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రపంచ దేశాలకు దీటుగా కరోనా సమయంలో కరోనాను ఎదుర్కోవడమే కాకుండా వ్యాక్సిన్ ని తయారు చేయడంతో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. భారతదేశం వ్యాక్సిన్ విషయంలో విజయవంతం అయినట్లు తెలిపారు. 214 కోట్ల వ్యాక్సినేషన్ అందజేసిన ఘనత దక్కిందన్నారు. ప్రతి మారుమూల గ్రామాలకు వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో డిజిటల్ టెక్నాలజీ ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ మిషన్ ద్వారా సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందుతుందని అన్నారు. ఈ రాష్ట్రంలో ఒక ఎయిమ్స్ ఆస్పత్రి ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. దేశంలో కేవలం 6 ఎయిమ్స్ హాస్పటల్ ఉండగా అవి ఇప్పుడు దేశంలో 22 ఎయిమ్స్ ఆసుపత్రిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో వైద్యులుగా మారి ప్రజలకు సేవ చేయాలని అన్నారు. తాను రాజకీయ నాయకురాలుగా మారిన, వైద్యురాలుగా నాసిక్ జిల్లాలో పోషకాహార లోపాన్ని నిర్మించడానికి స్వచ్ఛమైన తాగునీటి అందించడానికి కృషి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎయిమ్స్ ఆస్పత్రి కోసం 1022 కోట్లు మంజూరు అయినట్లు టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమైతున్నాయని 2023 కల్లా పనులు పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. దేశంలోని బీబీనగర్ ఎయిమ్స్ ను అత్యాధునిక ఎయిమ్స్‌గా తీర్చిదిద్దామని తెలపడం పట్ల ఆయన ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఎయిమ్స్ ఇనిస్ట్యూట్ పురోగతి పై క్లుప్తంగా వివరించారు. అనంతరం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వికాస్ భాటియా, అఫీషియటింగ్ డీన్ ప్రొఫెసర్ నితిన్ జాన్, డిప్యూటీ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ కల్నాల్ ఎస్పి అనంతరావు, అఫీషియటింగ్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ కళ్యాణి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మః ఎమ్మెల్యే

**హాలియా, ప్రభాతవార్త. సెప్టెంబర్ 10ః**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శనివారం హాలియా మున్సిపాలిటీలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి హాజరై అమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ బహుజన స్ఫూర్తి ప్రధాత, మహిళా చైతన్యానికి ప్రతీకగా ఐలమ్మ నిలిచిందన్నారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా అమె చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అప్కాబ్ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మార్కెట్ మాజీ చైర్మన్ యడవల్లి మహేందర్‌రెడ్డి, ఎన్నమల్ల సత్యం, చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్లు వర్ర వెంకట్‌రెడ్డి, నల్లబోతు వెంకటయ్య, ఎంపీటీసీ ఉర్లగొండ వెంకటయ్య, సురభి రాంబాబు, చాపల సైదులు, డొనిమిక్, చల్లా మట్టారెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, పిడిగం నాగయ్య, కాట్నం నాగరాజు, దుండిగల శ్రీను, రెడ్డిపల్లి జానకిరాములు, షేక్ హుస్సేన్, చంద్రు భాస్కర్‌రావు, రాయనబోయిన రామలింగయ్య, శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రజక సంఘం అధ్వర్యంలోః** హాలియా మున్సిపాలిటీలోని అమరవీరుల స్థూపం వద్ద రజక సంఘం చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షులు ఏడారి నరేష్, నారాయణరావు, అంజయ్య, జూపల్లి కృష్ణ, రెబెల్లి వెంకటేశ్వర్లు, అనుముల శ్రీను, భూతరాజు నగేష్, జూపల్లి సతీష్, బొట్టు శ్రీను, నాంపల్లి సురేందర్, దుండిగల శ్రీను, జానకిరాములు, పగిళ్ల సత్తి, పాతనబోయిన మహేష్, పాతనబోయిన ఈదయ్య, నగేష్, మహేష్, నరేష్, భూలోకం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామివారి సేవలో చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్

**యాదగిరిగుట్ట ,సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**



యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి గారిని శనివారం చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ బుద్ధ మురళి కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు .ఈ సందర్భంగా ప్రధాన ఆలయంలో విశేష పూజలు చేసిన అనంతరం అద్దాల మంటపం వద్ద వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి అభిషేక లడ్డూ ప్రసాదాన్ని అందించారు.

## బాధిత కుటుంబాలను అదుకుంటాం: ఎమ్మెల్యే భగత్‌కుమార్

**త్రిపురారం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**



మండలకేంద్రంలో ఈనెల 9న రోడ్డు ప్రమాదంలో గొర్రెలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా అదుకుంటామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే భగత్‌కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఇంజం కనకమ్మ, చింతకాయల అంజయ్యల కుటుంబాలను పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా గొర్రెలకాపరులను అదుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, టిఅర్ఎస్ జిల్లా నాయకులు మర్ల చంద్రారెడ్డి, దూళిపాల రామచంద్రయ్య, అనంతరెడ్డి, జానయ్య, ఫామోజు వెంకటాచారి, ఇంజం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**గొర్రెలకాపరులకు నష్టపరిహారం అందించాలి:** మండలకేంద్రంలో రోడ్డు ప్రమాదంలో గొర్రెలు కోల్పోయిన గొర్రెలకాపరుల కుటుంబాలకు తక్షణమే రూ.5లక్షల చొప్పున నష్టపరిహారంతో పాటు గాయపడిన గొర్రెలకు ప్రమాదభీమా వర్తింప చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో గొర్రెలు కోల్పోయిన కనకమ్మ, చింతకాయల అంజయ్య కుటుంబాలను పరామర్శించారు. అయన వెంట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు, ఉపసర్పంచ్ పిబి శ్రీనివాస్, రవి, అంజనేయులు, బాలకృష్ణ, చింతకాయల యాదయ్యలునా న్నరు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం – ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



**హుజూర్‌నగర్‌టౌన్ సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ భూమి, భుక్తి, విముక్తి కోసం, పెత్తందారీ వ్యవస్థ అధిపత్యంపై పోరాటం చేసిన గొప్ప మహిళ అని, ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటికి చిరస్మరణీయం అనిఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పట్టణంలోని చౌరస్తా సెంటర్‌లో ఎంపిపి గూడెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలోఐలమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ ఘన చరిత్రను, పోరాట స్ఫూర్తిని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, కౌన్సిలర్ గుండా ఫణికుమారి, రజక సంఘం నాయకులు దాసరాజు నారాయణ, చిలకరాజు అజయ్‌కుమార్, పెద్దారపు శంకర్, దుగ్గి గురువర్మ, ఇందిరాల రామకృష్ణ, దుగ్గి ఉషశ్రీ, గూడెపు దీప, అల్వాల ఉపేందర్, నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నై బతుకమ్మకి ఎమ్మెల్యే కిషోర్‌కి ఆహ్వానం



**నాగారం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** నాగారం మండల పరిధిలోని పసునూర్ గ్రామానికి చెందిన చెన్నై నగరవాసులు ఈనెల 25న, అక్టోబర్ మూడవ తేదీన చెన్నైలో జరిగే బతుకమ్మ సంబరాలకు తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ ను చెన్నై తెలంగాణ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలిపే విధంగా బతుకమ్మ సంబరాలు జరుపుకోవడం గర్వించదగ్గ విషయమని అన్నారు. బతుకమ్మ పండుగ ఖ్యాతిని దేశ నలుమూలలకు తెలిసేలా జరుపుకోవడం తెలంగాణ రాష్ట్ర గొప్పతనాన్ని తెలియజేస్తున్నది అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై తెలంగాణ సంఘం అధ్యక్షులు ఆల్వాల మల్లయ్య,ఉపాధ్యక్షులు శ్రీనివాస్ కార్యదర్శి, రామసాని రాజు, కోశాధికారి మరియు రాష్ట్ర తెలంగాణ గౌడ సేవా సమితి ఉపాధ్యక్షులు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, సలహాదారులు చింతల గిరి, షఫీ, పరశురాం, అభినవ్ ,అశోక్ ,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే భాస్కర్‌రావు

**మిర్యాలగూడ రూరల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** స్వచ్ఛ గురుకుల వారోత్సవాల్లో అన్ని గురుకులాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం అవంతీపురం తెలంగాణ గిరిజన గురుకుల అశ్రమ పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛ గురుకుల కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడుతూ గురుకులాల బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ వారోత్సవం చేపట్టి పాఠశాల ప్రాంగణంలో వ్యర్థాల తొలగింపు, మొక్కల పెంపకం తరగతి గదులు శుభ్రపరచడం, డార్మెటరీ, వంటగదుల పరిశుభ్రత చేపడుతుందన్నారు.

# సెల్ఫీ మోజులో యువకుడు మృతి

**డిండి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



సెల్ఫీ మోజులో యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలోని డిండి డ్యామ్ స్పిల్‌వే దగ్గర శనివారం సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఉడుత మనోజ్ తండ్రి పేరు శ్రీహరి స్వంత ఊరు షాద్నగర్ వయసు 22 సంవత్సరాలు సంవత్సరం కాలం నుంచి హైదరాబాదులోని ఎర్రగడ్డలో ఫ్యామిలీ నివాసం ఉంటుంది. జియాగూడలో ఉన్న వాళ్ళ అక్క దగ్గరే ఉంటూ ఐటీఐ మెకానికల్ పూర్తిచేసి వెడ్డింగ్ షూట్ ఫొటోగ్రాఫర్గా నేర్చుకుంటున్నాడు. హైద్రాబాద్ జియాగూడ నుండి శ్రీశైలం వినాయక నిమజ్జనానికి ఏడుగురు ఫ్రెండ్స్తో కలిసి బయల్దేరి శ్రీ శైలంలో నిమజ్జనంచేసి దైవదర్శనం పూర్తి చేసుకొని తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యలో డిండి ప్రాజెక్టు వద్ద ప్రాజెక్టు అలుగుపోస్తున్న అందాలను చూస్తూ సెల్ఫీ దిగడానికి స్పిల్‌వే వద్దకు వెళ్లి సెల్ఫీ దిగుతూ స్పిల్‌వే వద్ద కాలుజారి గల్లంతైనట్లు మృతుని ఫ్రెండ్స్ తెలిపారు. వెంటనే ఘటనా స్థలి వద్దకు తాసిల్దార్ ప్రశాంత్ సీఐ పరుశురామ్, ఎస్ఐ సురేష్, అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలి వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తాసిల్దార్ ప్రశాంత్ సీఐ పరశురామ్, ఎస్ఐ సురేషు తెలిపారు. మృతుని తో పాటు వచ్చిన మిత్రులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ నాగేశ్వర్ సీఐ పరశురామ్, తహసీల్దార్ ప్రశాంత్ సంఘటన సాయంత్రం సమయం కావడంతో మృతదేహాన్ని వెలిక్కి తీయడానికి ఇబ్బందికరంగా ఉండటంతో ఆదివారం ఉదయం గాలింపు చర్యలు చేపడతామని ఎస్ఐ సురేషు తెలిపారు.

# పాఠశాలా... వైన్ షాపా..!

**పాఠశాల పక్కనే దర్శనమిస్తున్న మద్యం సీసాలు...?**

**పెన్‌పహాడ్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



వైన్ షాప్ పక్కన బెల్టు దుకాణాల వద్ద దర్శనం ఇవ్వాల్సిన మద్యం సీసాలు పాఠశాల పక్కన దర్శనమిస్తున్నాయి. చూడటానికి అసహ్యంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో మద్యం దుకాణామా.. పాఠశాలనా అన్న చందంగా మారింది. ఈ దృశ్యం పలువురిని అబ్బుర పరుస్తుండగా మండల పరిధిలోని న్యూ బంజారాహిల్స్ గ్రామపంచాయతీ ఆవాసం ఎల్లప్ప కుంట తండా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గది కిటికీ వద్ద చోటు చేసుకోవడం విశేషం గ్రామానికి చెందిన కొందరు బెల్టు షాపులను వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యాలయాలు, దేవాలయాలకు సుదూరంగా నిర్వహించాల్సి ఉండగా పాఠశాల పక్కనే బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం వాడిన తర్వాత ఖాళీ సీసాలను పాఠశాల తరగతి గది పక్కన వేయడంతొ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు కూడా పట్టించుకోక పోవడంతో పాటు నిర్వాహకులు విచ్చలవిడిగా పడివేయడం అలసత్వానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా మద్యం దుకాణాలను పాఠశాల పక్కన నిర్వహించకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# గణేష్ లడ్డు వేలం పాట 20,116/-

**సూర్యాపేట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



అందరి సహకారంతో విద్యానగర్ లో అనేక ప్రాంతాలలో గణేష్ ఉత్సవాల నిర్వహణ ప్రశాంతంగా జరిగిందని, సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులకు టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, 45 వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని క్రపాకర్ ధన్యవాదములు తెలిపారు. శనివారం విద్యానగర్ అమ్మ హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద జరిగిన లడ్డూ వేలం పాటలో స్థానిక వ్యాపారస్తులు ఈగ దయాకర్ గుప్త 20,126/- లకు లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు అప్పం శ్రీనివాస రావు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు మొరిశెట్టి శ్రీనివాస్, తోట శ్యామ్ ప్రసాద్, బండారు రాజా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, నూకల వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, ముదిరెడ్డి అనిల్ రెడ్డి, కారింగుల బాలు గౌడ్, చిలుముల విజయలక్ష్మి, ఎలగందుల సుదర్శన్, కమిటీ సభ్యులు ఈగ విజయలక్ష్మి దయాకర్ గుప్త, మిర్యాల కవిత శివకుమార్, కర్నాటి అరుణ శేఖర్, ఉప్పల మంజుల నర్సయ్య, బజ్జూరి శ్రీనివాస్, మాడుగుల నవీన్, జూలకంటి నాగరాజు, తెరటపల్లి సతీష్, కుక్కడపు సాలయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**సూర్యాపేట, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం రాత్రి 12 గంటలకు జరిగిందని బాధితులు తెలిపారు. 29వ వార్డులోని బోయిళ్ల ఆదమ్మ భర్త చనిపోవడంతో కుమారునితో కలిసి ఉంటుంది. కోడలు ఊరికి పోవడంతో కొడుకుతో కలిసి తన సొంతూరుకి వెళ్లానని, రాత్రి చుట్టుపక్కల వారు మంటలను చూసి చెప్పడంతో ఫైర్ సిబ్బందికి ఇన్ఫర్మేషన్ ఇవ్వడంతో అప్పటికే పూర్తిగా ఇల్లు దగ్ధమైందని బాధితులు తెలిపారు. ఇంట్లో సామాన్లు, తులం బంగారం,12 తులాల వెండి గొలుసులు, ఖాళీ బూడిద అయిపోయాయి. కొడుకు కోడలు సర్టిఫికెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయని కన్నీరు పెట్టుకున్నారు. సుమారు ఆస్తి నష్టం 5 లక్షల వరకు జరిగిందని, కట్టుబట్టలతో ఉన్నామని, ప్రభుత్వం ఏ విధంగానైనా సహాయం చేయాలని తినడానికి తిండి కూడా లేదని బోరున విలపించారు.

# గురుకుల విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు**

**తుంగతుర్తి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించేందుకు గురుకుల పాఠశాలను ప్రవేశపెట్టిందని ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మరియు కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛ గురుకులం పేరున నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... స్వచ్ఛ గురుకుల కార్యక్రమంలో భాగంగా ఏడు రోజులపాటు చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రత, వాటర్‌ట్యాంకుల క్లీనింగ్, ప్లాంటేషన్‌తోపాటు కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురుకుల విద్యాలయంలోనే మెరుగైన విద్యతో పాటు ఆరాధకరమైన పరిస్థితి ఉంటుందని అన్నారు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలను అధునాతనంగా నిర్మించి మెరుగైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆహార, ఆరోగ్య విషయంలో పాఠశాల సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల వంటగది, డైనింగ్ హాల్, బోధన తరగతులతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య, తెరాస ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుల గుండగాని రాములు గౌడ్, ప్రగతిశీల తల్లిదండ్రుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ నరసయ్య మార్క్స్ అంబేద్కర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొండగడుపుల ఎల్లయ్య, పాఠశాల అధ్యక్షులు పోలేపాక రామచంద్రు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలత, వైస్ ప్రిన్సిపాల్ హాసీనా, ఉపాధ్యాయులు స్రవంతి, జ్యోతి ,నాగలక్ష్మి, రవికుమార్, పద్మ, అనిత తోపాటు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి

**తుంగతుర్తి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జీవితాన్ని నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలనీ గ్రామ సర్పంచ్ అబ్బ గాని పద్మ సత్యనారాయణ గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వెంపటి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ సమాజంలోని బానిస, వెట్టి చాకిరి వ్యవస్థ నుంచి విముక్తి కోసం పోరాటాలు చేయడమే కాకుండా సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచారన్నారు. నాడు నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీర వనిత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండగాని వీరసోములు, ఉప సర్పంచ్ భాషబోయిన వెంకన్న, రజక సంఘం అధ్యక్షులు ఐతరాజు అంజయ్య, ప్రధాన కార్యదర్శి బోనగిరి లక్ష్మినారాయణ, తునికి సాయిలు, పులుగుజ్జ యాకయ్య, మడిపెద్ది యాదయ్య, మడిపెద్ది, ముత్తయ్య,, మడిపెద్ది రాజయ్య, గుండగాని అంజయ్య ,యనగందుల విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఫణిగిరిలో ఉచిత వైద్య శిబిరం

**నాగారం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో మేరీ మాత హాస్పిటల్ పున ప్రారంభం సందర్భంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేరీ మాత హాస్పిటల్ నిర్వాహకులు ఫాదర్ జోసఫ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యశాల అందుబాటులో ఉండడం కోసం హాస్పిటల్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. డాక్టర్ హర్షవర్ధన్ చే వందమంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. నేటి నుండి మేరీ మాత ఆస్పత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గట్టు నరసింహారావు మేనేజర్ సిస్టర్ రినా, రోసి మేరి ,ఆన్ మేరీ, పులిజాల వేణుగోపాలరావు, వీరాచారి, వేణుధర్ ,శశి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 16న జాతీయ సమైక్యత దినోత్సవం ర్యాలీను విజయవంతం చేయండి

**తుంగతుర్తి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



నియోజకవర్గస్థాయిలో ఈనెల 16న తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించే జాతీయ సమైక్యత దినోత్సవ ర్యాలీ జయప్రదం చేయాలని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అధికారుల తో కలిసి నిర్వహించే ర్యాలీ తోపాటు సభాస్థలి వేదికను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసెప్టెంబర్ 16వ తేదీ నీ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ సమైక్యత దినోత్సవంగా ప్రకటించిం దని అన్నారు. ఈ సందర్భంగా పదివేల మందితో జాతీయ సమైక్య ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ సమైక్యత దినోత్సవ ర్యాలీకి నియోజకవర్గంలోని మండలాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సభకు వచ్చే సభ విజయవంతం చేయుట కోసం టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు స్థానిక శాసనసభ్యులు వెంటా ఉమ్మడి జిల్లా డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, నాయకులు కటకం వెంకటేశ్వర్లు, గుండెగాని రాములు గౌడ్ తో పాటు అడిషనల్ కలెక్టర్ మోహన్ రావు, డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్, డీఎస్పీ నాగభూషణం, సీఐ నాగార్జున గౌడ్, ఎస్ ఐ డానియల్, డిప్యూటీ తాసిల్దార్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ 37వ వర్ధంతి వేడుకలు

**ఆలేరు టౌన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



ఆలేరు పట్టణ కేంద్రంలో వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 37వ వర్ధం తి వేడుకలు తెరాస పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యం లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, కౌన్సిలర్ బేతి రాములు మాజీ సర్పంచ్ దాసి సంతోష్, ఫిలిప్ పత్తి వెంకటేష్, జూకంటి ఉప్పలయ్య, యువజన విభాగం అధ్యక్షుడు పూల శ్రవణ్, చింతకింది మురళి పాలేటి అనిల్, ఎండి షాబుద్దీన్, ఎండి ఫయాజ్, నారాయణ, సిద్ధులు, బాకీ ఆనంద్, మహమూద్ ,కందుల వినయ్, ఆలేటి అరుణ, టింకు తదితరులు పాల్గొన్నారు.

# న్యూమెగా సుభాష్ యూత్ అధ్యర్యంలో అన్నదానం

**ఆలేరు టౌన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**



వినాయకుని నవరాత్రులు పురస్కరించుకొని ఆలేరు పట్టణ కేంద్రంలో న్యూ మెగా సుభాష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం తెరాస పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, స్థానిక ఎస్ ఐ ఇద్రిస్ అలీలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఉత్సవ కమిటీ సభ్యులు, పూల శ్రవణ్, కమిటీకారి చింటూ, శ్రీకాంత్ కళ్యాణ్, నాయకులు దాసి సంతోష్, మోరిగాడి వెంకటేష్, పత్తి వెంకటేష్, మహమ్మద్, వినయ్, జింకల భరత్, టీంకు, ఎండీ ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ సేవలు గుర్తించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు: సట్టు తిరుమలేశ

**రాజపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

భూమి కోసం, బుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం, పేద ప్రజలు రైతుల కోసం పోరాడిన యోధురాలు చాలా చాకలి ఐలమ్మ సేవలను గుర్తించిన ప్రభుత్వాన్ని సట్టు తిరుమలేశ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రాజపేటలో చిట్యాల ఐలమ్మ 37 వర్ధంతి సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో జరిగింది. తిరుమలేష్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతులు అధికారికంగా జరుపుతున్నందుకు రాష్ట్ర ప్రభుత్వంకి, రజకులకు రెండు ఎకరాల రజక భవనానికి పట్టా ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మరియు ఓఎల బస్వరాజ్ సారయ్యకి అక్కరాజు శ్రీనివాస్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొలి మలి విడత తెలంగాణ ఉద్యమకారుడు పుల్లగారి సిద్ధయ్య, సట్టు సిద్దులు, పుల్లగారి లక్ష్మినారాయణ, స్థానిక సర్పంచ్ ఈశ్వరమ్మ శ్రీశైలం మరియు ఓఖగిఅదాచపల్లి రాజు టిఆర్ఎస్ నాయకులు సంధిల్ల భాస్కర్ గౌడ్, గాటే లక్ష్మణ్, ఊటుకూరి అశోక్జ్జీ నాయకులు ,లింగం, ఎర్ర గోకుల జశ్వంత్, నారాయణ, ఐరేని నరసింహులు, వరిమడ్ల కనకయ్య, వడ్లకొండ నరసయ్య, సంగం ఆంజనేయులు, జ్ఞానేందర్, చల్లూరి శీను, రమేష్, సాయిలు, పోచయ్య, రాజయ్య, అంజి, రజకులు పాల్గొన్నారు.

# మండలం కోసం శ్రీశైలంలో ఆర్యవైశ్యుల ప్రత్యేక పూజలు

**రాజాపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**



రఘునాథపురం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామ ఆర్యవైశ్య సంఘం సభ్యులు శనివారం శ్రీశైలం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఉప్పల సిద్ధిలింగం, రఘునాథపురం అధ్యక్షులు గందేశంకర్, మిగిలిన సభ్యులు అందరూ మాట్లాడుతూ న్యాయమైన రఘునాథపురం మండల ఏర్పాటు కోరికను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, గ్రామాన్ని పరిసర 12 గ్రామాల మరింత అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. నినాదాలు చేశారు.

# స్వామివారికి 30 వెండి కళాశాలకై నగదు బహుకరణ

**యాదగిరిగుట్ట ,సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**



అక్షర స్కూల్ యాజమాన్యం అరిశనపల్లి నారాయణ రావు, జగన్మోహన్రావు, మదన్మోహన్ రావు, రామారావు హైదరాబాద్ వారలు శ్రీ స్వామి వారి శతఘటాభిషేకమునకు వినియోగించు 30 ముప్పది వెండి కళాశాలకు రూ -తొమ్మిదిలక్షలను విరాళంగా అందజేసినారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆలయ ఏఈఓ గజ్వేల్ రమేష్ బాబు, సురేందర్రెడ్డి, రఘులు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ప్రధాన ఆలయంలో దాత కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

# ఇండియన్‌పాలిటి:

**రాజ్యాంగ ప్రవేశిక:**

ప్రవేశిక రాజ్యాంగానికి ఉపోద్ఘాతం, పీఠిక, మాతృక వంటిది.
భారత రాజ్యాంగం ప్రవేశికతో ప్రారంభమవుతుంది.
1946, డిసెంబరు 13న రాజ్యాంగ పరిషత్‌లో జవహర్‌లాల్‌నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్యాలు ఆశయాల తీర్మానం ప్రవేశికకు మూలాధారం.
భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పునాదులను ఆధారం చేసుకుని, భవిష్యత్తులో మన రాజ్యాంగం సాధించాల్సిన లక్ష్యాలు, ఆశయాలను రాజ్యాంగ నిర్మాతలు భారత రాజ్యాంగ పీఠికలో పొందుపరిచారు.

**ప్రవేశికకు ప్రేరణ:**

అమెరికా రాజ్యాంగం:
రాజ్యాంగ ప్రవేశికను అమెరికా నుంచి గ్రహించారు.. అమెరికా రాజ్యాంగం కూడా ప్రవేశికతోనే మొదలవుతుంది.
ఫ్రెంచి విప్లవం: ప్రవేశికకు మూలాధారమైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే భావనలను ఫ్రెంచి విప్లవం నుంచి తీసుకోవడం జరిగింది.
రష్యా విప్లవం: సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అనే ఆదర్శాలను రష్యా విప్లవం నుంచి సంగ్రహించాం.
లక్ష్యాల తీర్మానం: జవహర్‌లాల్ నెహ్రూ అందించిన చారిత్రక లక్ష్యాల, ఆశయాల తీర్మానం రాజ్యాంగ రూపకర్తల ప్రవేశికను రూపొందించడంలో దిక్సూచిలా పనిచేసింది.

**ప్రవేశిక:**

భారతదేశ ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి పౌరులందరికి
-సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని
-ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం ఆరాధనల్లో స్వాతంత్ర్యాన్ని చేకూర్చడానికి,

**ప్రవేశిక అర్థవివరణ:**

భారత రాజ్యాం ప్రవేశికను నాలుగు విభాగాలుగా విభజించి అధ్యయనం చేయవచ్చు.
1. అధికారానికి మూలం: భారత ప్రజలమైన మేము చిత్తశుద్ధితో ఈ రాజ్యాంగాన్ని రూపొందించి, అంగీకరించి, చట్టరూపంగా మాకు మేము సమర్పించుకుంటున్నాం. దీని ప్రకారం భారత రాజ్యాంగం ప్రజలకు బాధ్యత వహించే వ్యవస్థను రూపొందించింది. అన్ని ప్రభుత్వ వ్యవస్థల అధికారానికి మూలం ప్రజలు.
2. ప్రభుత్వ స్వరూపం: సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రగా పేర్కొన్నారు.

**సార్వభౌమాధికారం:**

భారతదేశం 1947, ఆగస్టు 15న సర్వస్వతంత్ర దేశంగా అవతరించింది. దీని ప్రకారం మన దేశ అంతరంగిక వ్యవహారాల్లో ఇతర దేశాలు జోక్యం చేసుకోకూడదు. ప్రపంచ దేశాలతో స్నేహం, శాంతి, విశ్వమానవ సౌభ్రాతృత్వం కోసం ఐక్యరాజ్యసమితిలో మనం సభ్యత్వం తీసుకున్నాం. అంతర్జాతీయ సంస్థల్లో భారతదేశం సభ్యత్వం తీసుకున్నప్పటికీ భారతదేశ సార్వభౌమత్వానికి ఎలాంటి ఆటంకం ఉండదు.

**సామ్యవాదం:**

1955లో ఆవడి జాతీయ కాంగ్రెస్ సమావేశంలో సామ్యవాద తరహా ప్రజాస్వామ్యం తమ లక్ష్యం అని మన తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రవేశికను సవరించి సామ్యవాద అనే పదాన్ని రాజ్యాంగానికి చేర్చింది. దీనిని సోవియేట్ యూనియన్ నుంచి తీసుకున్నారు. సామ్యవాదం అంటే ఆర్థిక న్యాయాన్ని, సమానత్వాన్ని సాధించి, వనరులను సామాజిక ప్రయోజనాలకు వినియోగించడం.
1982లో సుప్రీంకోర్టు డి.ఎస్.నకార వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో తీర్పుచెబుతూ, ఆర్థిక, సాంఘీక, జీవన ప్రమాణాల అసమానతలను రూపుమాపడం, కార్మికుందరికీ పుట్టినప్పటి నుంచి చనిపోయేంత వరకు సరైన జీవన ప్రమాణాన్ని సమకూర్చడమే సామ్యవాద లక్ష్యం.

**లౌకిక:**

ఇందిరాగాంధీ ప్రభుత్వం 1976లో 42వ రాజ్యాంగ సరవణ చట్టం ద్వారా లౌకిక అనే పదాన్ని రాజ్యాంగానికి చేర్చింది. ప్రభుత్వ వ్యవహారాల్లో మత ప్రమేయం లేని రాజ్యాంన్ని లౌకిక రాజ్యం అంటారు. దీని ప్రకారం రాజ్యానికి అధికార మతం అంటూ ఉండదు. మత వ్యవహారాల్లో రాజ్యం తటస్థంగా ఉంటుంది. ప్రభుత్వ విద్యాలయాలు, ప్రభుత్వ ధనసహాయం పొందే విద్యాలయాల్లో మతబోధన నిషేధం. మనదేశం అనాదికాలం నుంచి మత సామరస్యాన్ని అనుసరిస్తుంది. భారతదేశం బౌద్ధ, జైన మతాలకు పుట్టినిల్లు. విభిన్న మతాలు మనదేశంలో ఉన్నాయి.
ఎస్.ఆర్. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ లౌకికతత్వం అనేది భారత రాజ్యాంగ మౌలిక లక్షణమని పేర్కొంది.

**ప్రజాస్వామ్యం:**

అబ్రహం లింకన్ అభిప్రాయం ప్రకారం ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల యొక్క ప్రభుత్వం. ఆర్టికల్ 326 ప్రకారం మనదేశంలో 18 ఏళ్లు నిండిన వయోజనులందరికీ కుల, మత, జాతి, వర్గ, లింగ వివక్షతో సంబంధం లేకుండా సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించారు. నిర్దిష్ఠ కాల పరిమితిలో ఎన్నికలు నిర్వహించి, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ద్వారా బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఈ ప్రక్రియలో ప్రజల విశ్వాసం మేరకే ప్రభుత్వాల మనుగడ కొనసాగుతుంది. దీనిలో ప్రజలే పాలకులు, ప్రజలే పాలితులు. ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ప్రజలు పౌరులుగా ఎదుగుతారు.
1952లో జరిగిన తొలి లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో 17.32 కోట్లమంది ఓటర్లు పాల్గొన్నారు. 16వ లోక్‌సభ ఎన్నికల నాటికి వారి సంఖ్య 83 కోట్లకు చేరింది.

**గణతంత్ర రాజ్యం:**

భారతదేశం 1950, జనవరి 26న గణతంత్ర రాజ్యంగా అవతరించింది. దీని ప్రకారం సర్వోన్నతాధికారం ప్రజలకు, ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులకు ఉంటుంది. రాజ్యాధినేత వారసత్వంగా కాకుండా, నిర్ణీత పదవీ కాలానికి ప్రత్యక్ష లేదా పరోక్ష పద్ధతిలో ఎన్నికవుతారు.

**రాజకీయ వ్యవస్థ లక్ష్యాలు:**

ప్రజలందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించడానికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆదర్శాలను రాజ్యాంగంలో పొందుపరిచారు. శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వడం వీటి లక్ష్యం.
సామాజిక న్యాయాన్ని సాధించే అంశాలను-ప్రాథమిక హక్కుల్లోనూ, ఆర్థిక న్యాయాన్ని సాధించే అంశాలను -ఆదేశిక సూత్రాల్లోనూ, రాజకీయ న్యాయాన్ని సాధించే అంశాలను ఎన్నికల ప్రక్రియలోనూ పొందుపరిచారు.

**చట్టం అమలు తేదీ:**

1949 నవంబరు, 26న రాజ్యాంగాన్ని ఆమోదించటం జరిగింది. కొన్ని అంశాలు నవంబరు 26 నుంచే అమల్లోకి రాగా మిగతావి 1950, జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చాయి.

**ప్రవేశికలోని ఆదర్శాలు:**

**స్వేచ్ఛ:**

ప్రజాస్వామ్య మూల స్థంబాల్లో స్వేచ్ఛ కీలకమైంది. ప్రతి పౌరుడికి ఆలోచనలో, భావ ప్రకటనలో, విశ్వాసంలో,ఆరాధనలో స్వేచ్ఛ ఉండాలి. స్వేచ్ఛ పరిమితులు, నిర్బంధాలు లేకుండా పరిపూర్ణ వ్యక్తి వికాసానికి అవసరమైన పరిస్థితులను కల్పించడం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19లో 6 రకాల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను పొందుపరిచారు.

**సమానత్వం:**

పుట్టుకతో మానవులంతా సమానమే. అన్ని రకాల అసమానతలను, వివక్షలను రద్దు చేసి ప్రతి వ్యక్తి తనను తాను అభివృద్ధి పరచుకోవడానికి అవసరమైన అవకాశాలను కల్పించడమే సమానత్వం.

**సౌభ్రాతృత్వం:**

సౌభ్రాతృత్వం అంటే సోదర భావం అని అర్థం. పౌరుల మధ్య సంఘీభావం, పరస్పర సోదర భావం, గౌరవ భావం ఉండాలి. 1948, డిసెంబరు 10న ఐరాస విశ్వ మానవ హక్కుల ప్రకటనలో పేర్కొన్న సౌభ్రాతృత్వం భావన ఆధారంగా సార్వజనీన సోదర భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సైభ్రాతృత్వం అనే భావనను ప్రవేశికలో పొందుపరిచాలని ప్రతిపాదించారు. రాజ్యాంగంలోని 4వ భాగంలో ఉన్న ఆదేశిక సూత్రాల్లో ఆర్టికల్ 51 ప్రకారం ప్రపంచ దేశాల మధ్య సౌభ్రాతృత్వాన్ని, స్నేహ భావాన్ని పెంపొందించడానికి కృషి జరుగుతుంది.

**జాతీయ ఐక్యత, సమగ్రత:**

దేశంలోని ప్రజలు కలిసి ఉండటానికి, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి, జాతీయ ఐక్యత తప్పనిసరి.
సమగ్రత అనే పదాన్ని 1976ల6 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రవేశికలో పొందుపరిచింది. సమగ్రత ప్రజల మధ్య జాతీయ భావాన్ని పెంపొందిస్తుంది.

మనదేశంలో 1970వ దశకంలో అనేక ప్రాంతాల్లో ప్రాంతీయవాదం, వేర్పాటువాదం తలెత్తాయి. వీటి ఫలితంగా సమగ్రత అనే పదాన్ని ప్రవేశికకు చేర్చారు. దీని ప్రకారం భారత సమాఖ్య నుంచి ఏ ఒక్క ప్రాంతం లేదా రాష్ట్రం విడిపోవడానిఇక వీల్లేదు. ఐక్యత, సమగ్రతల ప్రధాన లక్ష్యం వేర్పాటు వాదాన్ని ఖండించటం.

**ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగమా ? కాదా?**

ప్రవేశిక రాజ్యాంగంలో అంతార్భగమా? కాదా? అనే అంశంపై సుప్రీం కోర్టు వివిధ సందర్భాలలో వేర్వురుగా తీర్పునిచ్చింది.

**బెరుబారికేసు:**

బెరుబారి భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న ఒక ప్రాంతం. ఈ భాగాన్ని భారత్, పాక్ మధ్య మార్పిడి విషయంలో వచ్చిన విభేదాల విషయమై అప్పటి భారత రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఆర్టికల్ 143(1) ప్రకారం సుప్రీంకోర్టు సలహాలు కోరారు. ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
కేశవానంద భారతి కసు వర్సెస్ కేరళ రాష్ట్రం 1973:
ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రవేశికను రాజ్యాంగంలో అంతర్భాగంగా పేర్కొంది. ఆర్టికల్ 368 ప్రకారం పార్లమెంట్ రాజ్యాంగాన్ని సవరించవచ్చునని, అయితే రాజ్యాంగ మౌలిక స్వరూపందెబ్బ తినకూడదని పేర్కొంది. న్యాయ సమీక్షను రాజ్యాంగంలోని మౌలిక అంశంగా సుప్రీంకోర్టు పేర్కొంది.

**ఎల్ఐసీ ఆఫ్ ఇండియా కేసు:**

ఈ కేసులో సుప్రీం కోర్టు తీర్పునిస్తూ ప్రవేశికను రాజ్యాంగంలో అంతర్భాగంగా పునరుద్ఘాటించింది.

**ప్రవేశికపై ప్రముఖుల వ్యాఖ్యానాలు:**

ప్రవేశిక రాజ్యాంగానికి ప్రాణం, ఆత్మ లాంటిది -డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
ప్రవేశిక అనేది మన కలలకు, ఆలోచనలకు రాజ్యాంగంలో వ్యక్తీకరించుకున్న అభిమతం- అల్లాడి కృష్ణస్వామి అయ్యర్?
ప్రవేశిక అనేది రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను, లక్ష్యాలను తెలుసుకోవడానికి ఒక తాళం చెవి లాంటిది. - జె.డయ్యర్
ప్రవేశిక అనేది రాజ్యాంగానికి కీలక సూచిక లాంటిది. అలాంటి సూచికలు సాధారణంగా పాశ్చాత్య రాజ్య వ్యవస్థలో ఉంటాయి. ఇవి భారత రాజ్యాంగంలో ఉన్నందుకు నేను పులకించి గర్వపడుతున్నాను - ఎర్నెస్ట్ బార్కర్
ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదు-మహావీర్ త్యాగి
ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం-డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్
ప్రవేశిక రాజ్యాంగానికి ఒక గుర్తింపు పత్రం లాంటిది-ఎమ్.ఎ.పాల్కీనా
భారత రాజ్యాంగ ప్రవేశిక అమెరికా స్వతంత్ర ప్రకటనలా రాజ్యాంగ ఆత్మ ప్రాణం, రాజకీయ వ్యవస్థ, స్వరూపం , పవిత్ర నిర్ణయాన్ని తెలియజేస్తుంది. విప్లవం తప్ప మరొకటి దీనిని మార్చలేదు- జస్టిస్ హిదయతుల్లా
రాజ్యాంగ ప్రధానాంశాల లక్షణ సారం- మధోల్కర్